“ఇన్ ఎ డిఫరెంట్ వే” అన్నాడు సురేష్.

తులసి అతని డొక్కలో మోచేత్తో పొడిచింది.

“తులసి మీ గురించి చాలా చెప్పింది” అన్నాడు మహేష్.

“ఆ విషయాలు కూడానా?”

మహేష్ టాపిక్ మార్చక తప్పలేదు.

“నాకు పోయిట్రీ అంటే చాలా ఇష్టం! నేను కూడా రాస్తుంటాను-షి లైక్స్ మై పోయిట్రీ.”

“ఐ లైక్ ప్రాక్టికల్స్”అన్నాడు సురేష్ .

“అన్నట్లు మీకు పరిచయం లేదు కదూ? ఈమె నా మిసెస్ ఉమారాణి!” అంటూ తన భార్యను పరిచయం చేశాడు.

“నమస్తే” అందామె.

“నమస్తే” అన్నాడు సురేష్ .

“ఇతను మా ఫ్రెండ్ ఆనంద్... తులసితోపాటు ఆనంద్ కూడా కాలేజీలో చదివాడు.”

“ఓ గ్లాడ్ టూ సీయూ....”

“అతని మిసెస్ కల్పన....”

ఆమె నమస్కారం చేసింది.

అందరూ సోఫాల్లో కూర్చుని విన్సెంట్ కోసం ఎదురుచూడసాగారు.

“మీ గురించి నిన్నే చెప్పాను విన్సెంట్ గారితో! ఓ.కె. అన్నారు” చెప్పాడు మహేష్.

“సో కైండాఫ్ యూ” అన్నాడు సురేష్.

“మీరు రీసెంట్‌గా మళ్ళీ ఏమైనా రాశారా?”అతనినడిగింది తులసి .

“ఒకనాటి వెన్నెల అనే సీన్ రాశాను... అఫ్‌కోర్స్ ఫెయిర్‌చేయలేదింకా.”

“ఓ! వినిపిస్తారా?” ఉత్సాహంగా అడిగిందామె.

“పదండి! నా లైబ్రరీ కెళదాం” అన్నాడతను సురేష్‌తో.

“నో థాంక్స్! అంతవరకూ ఓ ఓల్డ్ న్యూస్ పేపరేదయినా చదువుకుంటాను.”

“తనకి ఇలాంటివేమీ నచ్చవ్” అంది తులసి నవ్వుతూ.

“అయ్ గాట్ సమ్ ఇంట్రెస్ట్” అన్నాడు నవ్వుతూ.

ముగ్గురూ మేడ మెట్లు ఎక్కారు.

ఉమారాణి లోపల్నుంచి కూల్ డ్రింక్స్ తీసుకొచ్చిందందరికీ.

“వీళ్ళేరీ?” అడిగింది సోఫాలో కూర్చుంటూ.

“వెన్నెల్లోకెళ్ళారు.”

ఆమె ఆశ్చర్యంగా కిటికీలో నుంచి బయట చీకటివేపు చూసింది.

"అహ-ఇప్పటిది కాదులేండి ఒకనాటి వెన్నెల."

"ఓ! ఆయన పోయిట్రీయా? మరి మీరు వెళ్ళలేదేం?" సురేష్‌ని అడిగిందామె.

"నాకు తెలుగు సరిగ్గా రాదు. ఇంగ్లీషు మీడియమ్ యూ నో " అంది కల్పన.

ఉమరాణి నవ్వింది "నాకు పోయిట్రీ అంటే ఆసక్తి వుండదు."

"థాంక్‌గాడ్! నాకు తోడున్నారు పోయిట్రీ లైక్ చేయనివాడిని నేనొక్కడ్నే అని తులసి అంటూ వుంటుంది"

"మీకేం ఇష్టం మరి?" అడిగింది ఉమారాణి.

"గేమ్స్" అన్నాడు సురేష్ .

"ఓ! అయ్ టూ లవ్ గేమ్స్!" అంది కల్పన.

"నాకూ అవే ఇష్టం! మీరేమేం గేమ్స్ ఆడతారు?"

"ఇన్‌డోర్ గేమ్స్."

"అయ్ టూ లవ్ ఇన్‌డోర్ గేమ్స్" అంది కల్పన.

"నాకు టేబుల్ టెన్నిస్ అంటే యిష్టం! మరి మీకు?" అడిగింది.

"నాకూ టేబుల్ టెన్నిస్ యిష్టం! రోజూ రాత్రి పన్నెండింటి వరకూ ఆడతాం నేనూ తులసీ."

"మైగాడ్! ఏ క్లబ్‌లో."

"మా క్లబ్‌లో"

"మీ క్లబ్‌లో టేబుల్ టెన్నిస్ వుందా?"

"టేబుల్ ఇంకా కొనలేదు. ప్రస్తుతానికి బెడ్ ఉపయోగిస్తున్నాం."

"బెడ్ మీదా?" నమ్మలేనట్లు అడిగింది కల్పన.

"అవును"

కల్పనా ఉమారాణి ఒకరి మొహాలొకరు చూసుకున్నారు.

కొద్ది క్షణాలకు గానీ ఇద్దరికీ తెలీలేదు. ఇద్దరి మొహాల్లోకి రక్తం వేగంగా ప్రవహించింది సిగ్గుతోపాటు. కల్పన మేడమీదకు పరుగెత్తింది. ఉమారాణి వంటింట్లోకెళ్ళిపోయింది.

బయట కారు ఆగింది. వెంటనే హారన్ మోగింది. విన్సెంట్ ఠీవిగా కారు దిగి లోపలికొచ్చాడు.

అందరూ హాల్లోకొచ్చారు హడావుడిగా.

'వెల్‌కమ్' అన్నాడు మహేష్.

"గుడీవినింగ్ ఎవిరిబడి" అన్నాడు విన్సెంట్.

"గుడీవినింగ్. మీట్ అవర్ గెస్ట్స్ మిస్టర్ సురేష్ మిసెస్ తులసీ సురేష్ ఆనంద్

కల్పనానంద్ యూ నో ఉమ"

అందరితో కరచాలనం చేశాడతను.

భోజనాలు ప్రారంభమయ్యాయి.

అందరూ ఓవర్ లాపింగ్‌లో మాట్లాడుతున్నారు.

"మీ హాబీస్ ఏమిటి" అడిగాడు విన్సెంట్ సురేష్‌తో .

"లావుగా వున్న ఆడపిల్లలను వెనుక నుంచి బటక్స్ మీద లాగి కొట్టటం!"

విన్సెంట్ పగలబడి నవ్వాడు.

"ఒండర్‌ఫుల్ హాబీ!"

"ఎస్ ! అందరమ్మాయిలూ తిరగబడ్డారు గానీ ఒకే ఒక్క అమ్మాయి ఎంజాయ్ చేసేది. నా హాబీని ఒక్కసారి కూడా అభ్యంతర పెట్టలేదు".

"ఒండర్‌ఫుల్ గాళ్ ఎవరా అమ్మాయ్?"

"హైస్కూల్లో మా క్లాస్‌మేట్ అమ్మాయి పేరు..........పేరు....... ఫిలోమినా!"

విన్సెంట్ పగలబడి నవ్వాడు. కొద్దిక్షణాలు నవ్వాక హఠాత్తుగా నవ్వు ఆగిపోయింది. ముఖంలో సీరియస్‌నెస్ చొచ్చుకొచ్చింది,

"వాటీజ్ హర్ నేమ్"

"ఫిలోమినా"

"మీరెక్కడ చదివారు?"

"గుంటూరులో"

కొద్ది క్షణాలు అతను నిశ్శబ్దంగా వుండిపోయాడు. ఉమారాణి గట్టిగా నవ్వుతూ మాట్లాడుతోంది. మిగతా వాళ్ళందరూ ఆసక్తితో వింటున్నారు.

"బై చాన్స్- మీరు చదివింది గవర్నమెంట్ హైస్కూల్లో కాదు గదా"

సురేష్ ఆశ్చర్యపోయాడు.

"అవును! మీకెలా తెలిసిందా విషయం?"

"ఐ నో -ఐనో " అన్నాడు విన్సెంట్.

ఉమారాణి కబుర్లయిపోయాయ్.

"సో లాంగ్" అన్నాడు ఆనంద్

విన్సెంట్ అందరితోనూ కరచాలనం చేశాడు మళ్ళీ

"సీ యూ టుమారో ఇన్ మై ఆఫీస్" అన్నాడు సురేష్‌తో.

"షార్ప్ టెన్"

"ఎస్ షార్ప్ టెన్"

సురేష్ , తులసి యింటికి బయల్దేరారు.

"నువ్వు అంతా  స్పాయిల్ చేస్తావని నాకు తెలుసు" అందామె కోపంగా.

"ఎందుకు? నేనేం చేశాను?"

"విన్సెంట్‌తో ఏం మాట్లాడావ్?"

"హాబీ అడిగితే చెప్పాను"

"అదే తెలివితక్కువతనం"

"అడిగితే హాబీ గురించి చెప్పటమా?  అలాంటి హాబీ  వుండటమా?"

"రెండూనూ."

"ఇప్పుడేమైంది?"

"విన్సెంట్ భార్య పేరు ఫిలోమినా!"

"సో వాట్ ?"

"ఇంకో రెండుసార్లు మైగాడ్ అను"

కొద్ది క్షణాలు ఇద్దరు వుద్యోగం........

"నువ్వే ఆ పొజిషన్లో వుంటే యిస్తావా?"

"వాడి భార్య మీద అదే హాబీ రివెంజ్ తీసుకుని  తరువాత యిస్తాను"

*   *   *   *

గంగాభవాని బయటే కూర్చుని హండ్రెడ్ క్యాండిల్స్ వెలుగులో మాగ్‌జైన్ చదువుతోంది. సురేష్‌ని చూడగానే లేచి నిలబడింది

"ఇంకొంచెం  కాఫీ పొడి కావాలా?"

"అవసరం లేదు"

"పోనీ ఇవాళ మనిద్దరం కాఫీ  తాగుదాం"

"ముందు వెళ్ళండి యిక్కడి నుంచి"

"ఎందుకు?"

"మీ ముఖం చూడటం నాకిష్టం లేదు."

"అయితే లైటు తీసేద్దాం"

ఆమె లోపలికెళ్ళి తలుపులు మూసేసుకుంది.

సురేష్ యింట్లో కొచ్చేశాడు. తులసి తన పుస్తకాలు చదువుకుంటోంది డ్రస్ మార్చుకోకుండానే. ఆమె పక్కనే పడుకున్నాడతను.

"ఐయామ్ సారి తులసీ"

"ఎందుకు?"

"ఉద్యోగం సంపాదించలేకపోతున్నందుకు"

"దట్స్ ఓకె! గానీ త్వరగా ఏదో ఒక ఉద్యోగం సంపాదించక పోతే"

"నేను సిన్సియర్‌గానే ట్రై చేస్తున్నాను తులసీ. కానీ....రాంగ్ క్వాలిఫికేషన్ అయిపోయింది. ఎవ్వరికీ సోషయాలజీ అవసరం లేదు! ఇంకొద్ది రోజులు చూసి క్లినిక్ ఓపెన్ చేస్తాను."

"క్లినిక్కా"

"అవును"

"ఏం క్లినిక్"

"సెక్స్ క్లినిక్. మీలో దాంపత్య సుఖం లోపించిందా? వెంటనే డాక్టర్ సురేష్ క్లినిక్‌కి రండి. మీకు పిల్లలు లేరా? డాక్టర్ సురేష్‌ని ఒంటరిగా సంప్రదించండి! సుఖవ్యాధులా డాక్టర్ సురేష్ క్లినిక్. స్త్రీలకు ప్రత్యేక వసతి కలదు. సిజేరియన్లు ఎబార్షన్లు మా ప్రత్యేకత విద్యార్థినులకు కన్సెషన్ రేట్లు. దీపావళీ, దసరాలకు యాభయ్ శాతం రిబేట్......."

తులసి నవ్వుతోంది.

"నువ్వు డాక్టర్ వెప్పుడయావ్"

"ఇలాంటి క్లినిక్‌లకు డాక్టర్ కావలసిన అవసరం లేదు. క్లినిక్ ఓపెన్ చేసి పేపర్లో పబ్లిసిటీ ఇవ్వటమే.....క్యూ కడతారు జనం. మన దేశంలో ఇలాంటివేం చేసినా అడిగేవారు లేరు. తెలివితక్కువ జనానికి లోటులేదు"

అతని చేయి కుచ్చెళ్ళమీదకు జారింది,

"వద్దు అంది తులసి"

"ఎందుకని"

"డాక్టర్ యిచ్చిన మందు పనిచేసింది"

"థాంక్ గాడ్. నో టెర్మినేషన్ బిల్! హా.. హా... లక్కీ సిటిజెన్ ఐయామ్" తులసిని తన మీదకు లాక్కుని పెదాల మీద ముద్దు పెట్టుకున్నాడతను.

* * * *

"ఇంకా ఆఫీస్‌కి బయల్దేర లేదేం?" తులసిని అడిగింది గంగా భవాని.

"ఉద్యోగం పోయింది"

"అయ్యో ! మరిప్పుడెలా?" సానుభూతిగా అంది.

"తులసి ఇంట్లో వున్నా ఫర్వాలేదు. మనకేమీ అడ్డు చెప్పదు. అదంతా నేను మాట్లాడి సెటిల్ చేశాను" అన్నాడు సురేష్.

గంగాభవాని అతనిని లెక్కచేయలేదు.